బీఆర్ఎస్, కాంగ్రెస్ పథకాలు రాజకీయ లబ్ధికోసమే

● ఎంపీ డాక్టర్ లక్ష్మణ్


కేంద్ర సంక్షేమ పథకాల వివరాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ లక్ష్మణ్

చిక్కడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకాలు రాజకీయ లబ్ధికోసమే తప్ప పేదల సంక్షేమం కోసం కాదని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లో లబ్ధిదారి సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, నాయకులు శ్రీకాంత్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్‌తో అప్రమత్తంగా ఉండాలి

కవాడిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె లక్ష్మణ్ సూచించారు. బుధవారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డీబీఆర్ మిల్స్ హెల్త్‌సెంటర్‌లో లయన్స్‌క్లబ్(ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి), తరంగిణి సంస్థల సంయుక్తాధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 45 మంది మహిళలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్పొరేటర్ రచనశ్రీ, డీబీఆర్‌మిల్ హెల్త్ సెంటర్ డాక్టర్ అవంతి, డాక్టర్ నళిని తదితరులు పాల్గొన్నారు.

అధిక మొత్తంలో నగదు తీసుకెళితే సీజ్ చేస్తాం : సీఐ

కవాడిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వాహనల తనిఖీ విస్తృతం చేస్తున్నామని దోమలగూడ సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఇందిరాపార్కు చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెకింగ్ పాయింట్‌ను సందర్శించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల్లో నగదు అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళితే పత్రాలు చూపించాలని, లేకపోతే సీజ్ చేస్తామని సీఐ హెచ్చరించారు.

విభిన్నరంగాల్లో నిపుణుడు అడవి బాపిరాజు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఇనాక్

చిక్కడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కవిగా, చిత్రకారుడిగా, శిల్పిగా ఇలా విభిన్నరంగాల్లో నిపుణుడు అడవి బాపిరాజు అని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం దశాబ్దిపూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో భాగంగా అడవి బాపిరాజు సంస్మరణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఇనాక్ మాట్లాడుతూ.. వాస్తవిక దృష్టితో నవలా రచనల్లో బాపిరాజు సిద్ధహస్తుడన్నారు. ఆయన చారిత్రక నవలాచక్రవర్తి అని వివరించారు. ఒక వ్యక్తిలో భిన్న కళాప్రక్రియలు ఉండడం బహు అరుదు అని అన్నారు. జాతీయ ఉద్యమంలో ఆయన పాత్ర మరిచిపోలేనిదన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, కేవీ రావు, ఎస్‌బిరామ్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ ఆదాయం రూ. 1.12 లక్షలు

చిక్కడపల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం లక్షా 12 వేల 953 రూపాయలు వచ్చింది. నెలరోజుల హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయంలోని సీతారామ కల్యాణమండపంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ ఈవో మాచర్ల దేవనాథం, ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ పర్యవేక్షణలో లెక్కించారు. ఈవో దేవనాథం మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్

బీసీలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి

రాంనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బీసీలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో బీసీ రాజ్యాధికార సమితి కార్యాలయంలో జరిగిన బీసీ మేధావుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. బీసీ సంఘాల నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, జి.ఆనందం, బోనం ఊర్మిళ, కొండ స్వామి, పుష్పలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి వ్యతిరేకంగా..

ఆటోడ్రైవర్లు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలి

నల్లకుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి వ్యతిరేకంగా ఆటోడ్రైవర్లు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని షేక్‌హ్యాండ్ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ పిలుపునిచ్చారు. బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోటారు వాహనాల చట్టంలో ఉచిత బస్సు ప్రయాణానికి చట్టబద్ధత లేదన్నారు. ఇటీవల నిజామాబాద్‌లో నిరుపేద ఆటోడ్రైవర్ ఆర్థిక ఇబ్బందులతో భార్యను చంపి తను ఆత్మహత్య చేసుకున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు ఎస్.కె.బి.జమా, రహీముద్దీన్, హమీద్ అన్సారీ, అజీమొద్దీన్, జాఫర్‌బాయి, జైసింగ్ ఠాకూర్, కె.లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి : బీఆర్‌టీయూ

రాంనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లకు గిరాకీ లేక సుమారు 40 మంది ఆత్మహత్య చేసుకున్నారని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ (బీఆర్‌టీయూ) అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ పి.నారాయణ తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉచిత బస్సు ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదన్నారు. ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నెలకు రూ. 15 వేల ఆర్థిక సహకారం అందించకపోతే బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

హైదరాబాద్, మార్చి 20: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స అందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. హైదరాబాద్‌లోని బాలాపూర్ రోడ్డు, ధాతునగర్ కమ్యూనిటీ హాల్, రోడ్ నం.10, జై జగదాంబ ట్రేడర్స్ ఎదురుగా ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 20, 21, 22, 23 తేదీల్లో నాలుగు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు.

చికిత్స పొందిన మహిళ మాటల్లో: గతంలో ఒక మహిళ పులిపిర్లతో (అంతర్భాగాలు) ఎవరికి చూపించలేక బాధపడుతుండగా స్త్రీలకు ఇక్కడ ప్రత్యేకంగా సేవలు అందిస్తున్నారని తెలిసి ఇక్కడికి రాగా పరిష్కారం లభించడంతో సంతోషంగా ఉందని తెలిపారు. మరికొందరితో చర్చించి చికిత్సను గురించి పూర్తిగా తెలియపరిచి వారిని కూడా తనతో పాటు ఇక్కడికి తీసుకురావడం వారు కూడా చికిత్స అనంతరం సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఈ వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9440251969 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.

లష్కర్ బరిలో పజ్జన్న?


పద్మారావుగౌడ్

హైదరాబాద్ సిటీ/సికింద్రాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్ (పజ్జన్న) బరిలో దిగే అవకాశాలున్నాయి. ఈ మేరకు పార్టీ అగ్రనేతలు సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నేడు లేదా 23 తర్వాత అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అగ్రనేతల సంకేతాల నేపథ్యంలో పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు కంగ్రాట్స్ పజ్జన్న అంటూ.. వాట్సప్ స్టేటస్‌లు పెట్టుకున్నారు. దీంతో ఆయన పేరు ప్రకటించడం లాంఛనమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు పలువురు నాయకుల పేర్లు తెరపైకి వచ్చినా, చివరి నిమిషంలో పద్మారావును బరిలోకి దింపాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. గ్రేటర్‌లో పార్టీకి బలం ఉండడం.. ప్రజలకు తెలిసిన నాయకుడిని పోటీ చేయించడం ద్వారా విజయావకాశాలు మెరుగవుతాయన్నది పార్టీ యోచనగా తెలుస్తోంది.

తలసాని విముఖత..

అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌వాసులు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. 24 స్థానాల్లో 16 చోట్ల గులాబీ జెండా ఎగిరింది. ఈ పరంపరను లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పార్టీ భావిస్తోంది. ఈ క్రమంలోనే అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తోంది. సికింద్రాబాద్ నుంచి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తనయుడు సాయికిరణ్ పోటీ చేస్తారని మొదటి నుంచీ ప్రచారం జరిగింది. పార్టీ అధిష్ఠానం మాత్రం శ్రీనివాస్‌యాదవ్‌ను పోటీ చేయాలని సూచించినట్టు తెలిసింది. అందుకు ఆయన సుముఖంగా లేకపోవడంతో పద్మారావుగౌడ్ వైపు పార్టీ మొగ్గు చూపినట్టు సమాచారం. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారు. ఇటీవల ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హస్తం గూటికి చేరారు. పార్లమెంట్ స్థానంలో మంచి ఆదరణ ఉందని భావిస్తోన్న పార్టీ.. బలమైన నాయకుడిని పోటీ చేయించడం ద్వారా ఇక్కడ ఖాతా తెరవాలనే తలంపుతో ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే పద్మారావుకు అవకాశం ఇచ్చినట్టు సమాచారం.

నగర రాజకీయాలతో ఐదు దశాబ్దాల అనుబంధం

నగర రాజకీయాలతో పద్మారావుకు ఐదు దశాబ్దాల అనుబంధముంది. 1973లో దివంగత ఇందిరాగాంధీ సమక్షంలో పద్మారావు యువజన కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం యువజన కాంగ్రెస్ నగర, రాష్ట్ర పదవులు నిర్వహించారు. 1977 నుంచి జంటనగరాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1986లో హిస్సాంగంజ్ మోండా మార్కెట్ కార్పొరేటర్‌గా కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించారు. 1991వరకు కార్పొరేటర్‌గా కొనసాగారు. 2001లో కేసీఆర్ పిలుపు మేరకు టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. టీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. 2002 నుంచి 2004 వరకు మళ్లీ కార్పొరేటర్‌గా ఉన్నారు. 2004లో తొలిసారిగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

2014, 2018, 2023లో కూడా ఆయన అదే పార్టీ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. 2014 జూన్‌లో తెలంగాణ రాష్ట్ర తొలి ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2019 నుంచి 2023 వరకు డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. పార్టీలకతీతంగా నగరంలోని చాలామంది నేతలతో పద్మారావుకు సత్సంబంధాలున్నాయి. ఇది ఎన్నికల్లో ఎంతమేరకు ఉపకరిస్తుందన్నది ఆసక్తికరం కానుంది.

మారుతున్న పేర్లు..

బీజేపీ నుంచి సిటింగ్ ఎంపీ కిషన్‌రెడ్డి పేరు ఇప్పటికే ఖరారైంది. ఆయన ప్రచారమూ ప్రారంభించారు. ఊహించని పరిణామాలు జరిగితే తప్ప బీఆర్ఎస్ నుంచి పద్మారావుగౌడ్ పోటీ దాదాపు ఖాయమే. కాంగ్రెస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగిందని, అధికారిక ప్రకటనే తరువాయి అని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. తొలుత కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరు వినిపించింది. ఆయన సన్నిహితులు కూడా టికెట్ తమ నేతకే అని, రెండో జాబితాలో పేరు ఉంటుందని చెప్పారు. రామ్మోహన్ కూడా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. కిషన్‌రెడ్డి, పద్మారావుగౌడ్, నాగేందర్/రామ్మోహన్‌లో ఎవరు బరిలో ఉన్నా.. ఇక్కడ హోరాహోరీగా త్రిముఖ పోరు జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

వైభవంగా ఫాల్గుణ మేళా


నిషాన్ యాత్రలో యువతులు

బర్కత్‌పుర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వీరన్నగుట్టలోని శ్యాంబాబా మందిర్‌లో ఫాల్గుణ మేళా ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. మహాభారత యుద్ధంలో కలియుగ కృష్ణుడిగా భావించే శ్యాంబాబా తన శిరస్సును దానమిచ్చిన రోజును ఫాల్గుణ మేళా ఉత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల సందర్భంగా శ్యాంబాబా దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేలాదిమంది భక్తులు శ్యాంబాబాను దర్శించుకున్నారు. నగరంతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు శ్యాంబాబా మందిరానికి తరలిరావడంతో సందడి నెలకొంది. ఉదయం నిషాన్ పూజ, ప్రసాద వితరణ గావించారు. శ్యాంబాబాను రంగురంగుల పూలతో అలంకరించారు. 56 రకాల మిఠాయిలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా శ్యాంమందిర్ సేవా సమితి ఏర్పాట్లు చేసింది.

నగర నలుమూలల నుంచి నిషాన్ యాత్ర

ఫాల్గుణమేళా ఉత్సవాన్ని పురస్కరించుకొని వందలాది మంది యువతీ, యువకులు నగర నలుమూలల నుంచి నిషాన్‌యాత్రను శోభాయమానంగా నిర్వహించారు. రంగురంగుల జెండాలను చేతపట్టుకొని భక్తి పాటలు, భజనలు, నృత్యాలు చేసుకుంటూ శ్యాంబాబా మందిర్‌కు చేరుకున్నారు. మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్, చార్మినార్, గుల్జార్‌హౌస్, బేగంబజార్, గోషామహల్, నాంపల్లి, పాతబస్తీలోని పలు ప్రాంతాల నుంచి ఈ యాత్ర నిర్వహించారు. శ్యాంబాబా దేవాలయం వద్ద నిషాన్‌యాత్రకు శ్యాంమందిర్ సేవాసమితి అధ్యక్షుడు చంద్రకాంత్ డకోటియా, కార్యదర్శి ఇంద్రకరణ్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శులు రాజ్‌కుమార్‌విగ్, రాందేవ్ అగర్వాల్, సేవా సమితి ప్రతినిధులుప్రహ్లాద్ టిబ్రివాలే, సురేష్‌కుమార్ అగర్వాల్, అశోక్‌రావు, కపిల్‌కుమార్ అగర్వాల్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పూలు చల్లుతూ స్వాగతం పలికారు. పలు ప్రాంతాల నుంచి యువతీ, యువకులు తీసుకువచ్చిన రంగురంగుల జెండాలను శ్యాంబాబా మందిర్ ఆవరణలో ప్రతిష్ఠించారు. ఉత్సవాల్లో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, బీజేపీ నాయకులు భీమ్‌రాజ్, రవియాదవ్ సూరి, రాజు పాల్గొన్నారు.

సుశీలమ్మ సేవలు మరువలేనివి


సుశీలమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

ముషీరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లో తలారి సుశీలమ్మ అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ముఠాగోపాల్ కొనియాడారు. బుధవారం పార్సీగుట్టవద్దగల ఎస్ఎల్ఎన్ఎస్ హాల్‌లో శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆమె సంతాప సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల హరిబాబు యాదవ్, ముఠా జైసింహ, ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు సుశీలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలలో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం 30 రోజులపాటు అయ్యప్ప పూజా సామగ్రి వందలాది మందికి ఉచితంగా అందజేయడంతోపాటు పేదలకు నిత్యావసరాల పంపిణీ, విద్యార్థులకు చేయూతనిస్తూ సుశీలమ్మ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, తలారి శ్రీకాంత్ ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు డి. శివముదిరాజ్, పూసగోరక్‌నాథ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్‌లో పూడికతీత


పూడికతీత పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమ్‌నగర్‌లో మ్యాన్‌హోల్స్‌లో పూడికతీత పనులను బుధవారం నిర్వహించారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు

50 శాతం సీట్లు కేటాయించాలి

బర్కత్‌పుర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. బీసీలను విస్మరించిన పార్టీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠంచెబుతామని హెచ్చరించారు, బుధవారం కాచిగూడలో బీసీ దళ్ జాతీయ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ బీసీలకు ఎనిమిది చొప్పున టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. టికెట్ల కేటాయింపుపై ఆ రెండు పార్టీల నేతలు తమ వైఖరి స్పష్టం చేయాలన్నారు. సమావేశంలో బీసీ దళ్ నేతలు వెంకటరమణ, మహేంద్రబాబు, రూబి, సాయియాదవ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలి

రాంనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు కాంగ్రెస్ పార్టీ రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చేవెళ్లలో చేసిన దళిత డిక్లరేషన్‌ను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. బుధవారం విద్యానగర్‌లో ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నామినెటెడ్ పదవులు, ఎంపీ సీట్ల కేటాయింపులో మాలలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ.. మాదిగలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. పెద్దపల్లి ఎంపీ సీటు మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మాదిగలకు అన్యాయం చేస్తే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో వ్యక్తి అదృశ్యం

అంబర్‌పేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నివసిస్తున్న పాలపు రాజేష్(37) సికింద్రాబాద్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజేష్ ఇటీవల బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. దీని కోసం అప్పులు చేశాడు. ఈనెల 10వ తేదీ ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రెండు రోజులు భార్యతో ఫోన్‌లో మాట్లాడి త్వరలో ఇంటికి వస్తానని చెప్పాడు. భార్య ఫోన్ చేస్తుండగా వారం నుంచి అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. రాజేష్ ఆచూకీ లభించకపోవడంతో భార్య సంపూర్ణ అంబర్‌పేట పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

29న నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డుల ప్రదానం

నల్లకుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డుల ప్రదానోత్సవం ఈ నెల 29న మాదాపూర్ టీ హబ్‌లో నిర్వహిస్తున్నామని ట్యాక్స్ ఫైలింగ్ ఫౌండర్ ఇండియా కంపెనీ సీఈవో చల్లూరి శ్రీనివాస్, ప్రపంచ పర్యావరణ సంస్థ ఫౌండర్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ భద్ర వెల్లడించారు. బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డుల కార్యక్రమ లోగోను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ఎంపీ ఆర్.కృష్ణయ్య, టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్, జస్టిస్ బి.చంద్రకుమార్, విమలక్క తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ అవార్డులకు ఇప్పటికే సుమారు 300 నామినేషన్స్ వచ్చాయని, డిసెంబర్‌లో అంతర్జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహించేందుకు నామినేషన్లు స్వీకరిస్తున్నామన్నారు. సమావేశంలో ప్రతినిధులు రాంప్రకాష్‌మాలి, ప్రదీప్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగులు ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించేలా జీవో తీసుకురావాలి


మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం నేతలు

బర్కత్‌పుర, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చేనేత కుటుంబాలను ఆదుకోవడానికి ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకురావాలని అఖిల భారత పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూర్యపి. రవికుమార్ విజ్ఞప్తి చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పద్మశాలీలకు రాజ్యసభ టికెట్, నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని, ఆరు కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమించాలని కోరారు.

పిల్లర్ గుంతలో పడిన ద్విచక్రవాహనం


పిల్లర్ గుంతలో ద్విచక్రవాహనం

అంబర్‌పేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఫ్లైఓవర్ కోసం నిర్మిస్తున్న పిల్లర్ గుంతలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పడిపోయింది. అదృష్టవశాత్తు వాహనం నడుపుతున్న వ్యక్తికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అంబర్‌పేటకు చెందిన ఓ వ్యక్తి బుధవారం మధ్యాహ్నం ఇద్దరు పిల్లలతో కలిసి యాక్టివాపై అంబర్‌పేట ఎంసీహెచ్ గ్రౌండ్‌కు వెళ్తున్నాడు. ముఖరం హోటల్ సమీపంలో వాహనం ప్రమాదవశాత్తు పిల్లర్ గుంతలో పడిపోయింది.

అంబేడ్కర్ పోరాట స్ఫూర్తితో సమానత్వం కోసం ముందుకు సాగాలి

కవాడిగూడ, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం అంబేడ్కర్ ఎన్నో పోరాటాలు చేశారని మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు దయానంద్ అన్నారు. దళితుల తాగునీటి కోసం 1927 మార్చి 20న అంబేడ్కర్ చేపట్టిన మహద్ సత్యాగ్రహాన్ని గుర్తుచేసుకుంటూ బుధవారం ట్యాంక్‌బండ్‌లో ఆయన విగ్రహానికి దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ.. దళితులను చెరువులో నీరు తాగొద్దని అగ్రవర్ణాలు అంక్షలు పెట్టి దాడులు చేస్తే అంబేడ్కర్ సత్యాగ్రహ పోరాటానికి పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఇప్పటికీ అలాంటి వివక్షత దళితులు ఎదుర్కోవడం బాధాకరమన్నారు. అంబేడ్కర్ పోరాట స్ఫూర్తితో ప్రతిఒక్కరూ సమానత్వం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి

రాంనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కళాశాలల యాజమాన్యాలు కృషిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పినపాపాటి ప్రసాద్ సూచించారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో అంబేడ్కర్ కళాశాలలో ఉస్మానియా యూనివర్సిటీ, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీల సంయుక్తాధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీపై అవగాహన పెంచేందుకు సొసైటీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎయిడ్స్ కంట్రోల్ యువజన కో-ఆర్డినేటర్ ఎం.రమేష్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

ముషీరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాయామ, విద్య, ఉపాధ్యాయ సంఘం (పీఈటీఏ) క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. రాంరెడ్డి, నగర అధ్యక్షుడు పి. కిషోర్ కుమార్ బుధవారం ముషీరాబాద్ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం కార్యదర్శి విజయసాగర్, నాయకులు సిద్దార్థ్, మహ్మద్ రఫీక్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఘంటసాల గంధర్వగానామృతం


శివారెడ్డిని సత్కరిస్తున్న పి.నాగేశ్వరరావు, దాము

రాంనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్వర సామ్రాట్ డాక్టర్ టి.శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో బుధవారం రాత్రి సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఘంటసాల గంధర్వ గానామృతం విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నటుడు, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి, క్యాట్స్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు కొండపు సుధారాణి, గూడూరు శ్రీనివాస్, ది సీఎల్‌సీ గ్రూప్ (అమెరికా) చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి, వరంగల్ లా కళాశాల చైర్మన్ విద్యాసాగర్, ఐడల్ గంధర్వ అధ్యక్షుడు దాము గేదెల, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వీడీ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. శివారెడ్డిని అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ ఐడల్‌గంధ్వర డాట్ ఓఆర్‌జి, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ ఐడల్‌గంధర్వ డాట్ కామ్ వెబ్‌సైట్లను అతిథులు ప్రారంభించారు. అనంతరం టి.శరత్‌చంద్ర సంగీత సారథ్యంలో గాయనీ, గాయకులు డాక్టర్ వై.వి.రమణ, గాయత్రి, నారాయణ, తరుణి, వెంకట్ గానాలాపన చేశారు. కార్యక్రమ నిర్వాహకులు శివరమ్య ధరణిప్రగడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన వారిని సత్కరించారు.